బెల్లపు జీళ్ళ మొహం ఎరగని వారికి చక్కెర కడ్డీలు ఎలా తెలుస్తాయి) జాంకాయలు పెట్టేవారు. మా మావయ్యగారు తేగల్ని బాగా కాలుస్తారు. అంతా సమంగా పంచుకుని తినే వాళ్ళం. సంతనించి తిరిగి యింటికి వచ్చేప్పుడు మళ్ళీ వచ్చే వారం థ్రిల్ కోసం పిల్లలంతా కాచుక్కూచునే వాళ్ళం పెళ్ళయిపోయాక పెళ్ళిపందిర్లా సంత అయిపోయాక సంత పాకలు దిగులుగా వెల వెలబోతూ నిర్మానుష్యంగా డల్‌గా కనిపించేవి. ఇప్పుడైనా సరే మావారు సంతకెళ్దామంటే నేను రడీ!

# సౌండ్ ఆఫ్ మ్యూజిక్

ఏదో ఒక వేదనవుంటే దాన్ని సమ్-వేదన అన్నట్లుగా ఏదో ఒక గీతాన్ని పాడుకుంటే దాన్ని సమ్‌గీతం అనొచ్చు. పెళ్ళాం కబుర్లు ఒకప్పుడు సమ్-గీతంలా వినపడ్తాయి. ధ్వని ఎప్పుడు పుట్టిందో సంగీతం కూడా అప్పుడు పుట్టి వుంటుంది. ఏడుపు ఎప్పుడు మొదలై వుంటుందో పాట కూడా అప్పుడే ప్రారంభం కావాలి. కవి కోకిలకు ఏడుపులోంచి కవిత్వం రాలేదా - ఎన్నయినా వస్తాయి ఏడుపులోంచి, ఏడుపు పాటలూ సంతోషం పాటలూ అని రెండురకాలూ విని పొందేది ఆనందవే కదా - ఎటువంటి విషాదమైనా అందులోంచి ఆనందాన్ని ఆరెంజి జ్యూస్‌లా పిండుకోవటం అందరెరిగిన పరమ రహస్యం....

"ఇంటింటా ఒక భామ-ప్రతి ఇంట్లోనూ ఒక పంచవన్నెలభామ" (ఇదీ మన స్లోగన్) మన స్లోగన్ రాణి ఆ రంగుల రామచిలుక హమేషా తమాషాగా తలుపుల మీద తలపుల మీద దరువులు వేస్తూ మొగుడిచేత మోహనంగా "కోపమేల రాధా దయజూడవేల నాపై..." అని చిటికలు వేయిస్తూ సేఫ్టీ రేజర్స్ ఎడ్జి పై నాట్యం చేయిస్తూ వుంటుంది. మ్యాజిక్కు లేదు గదా!

గల్ఫ్ స్ట్రీమ్‌లాగా జీవితం అట్టడుగున తూముల్లోంచి బాత్రూము ల్లోంచి సంగీతాలుకాని గీతాలుకాని ప్రవహించకపోతే, బ్రతుకు నీరింకిన చెరువులాగా గుండె చెరువై పోయేటంత మహా భయంకరంగా వుంటుంది.

"ప్రణయవతీ నాపై కోపమా... కోపమా.. కోపమా..." అని మోహనలో ఒక పాత లవ్ సాంగ్ రికార్డుండేది. మగాళ్ళని ఆడాళ్ళూ వైస్ వెర్సా బ్రతిమాలుకునే అలకపాటలు కోకొల్లలుగా వినవచ్చేవి. అలక పాటలంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న రాత్రి భోయినాలయాక పొయ్యి అలుకుతూంటే "అలుక మానవుకదె యికనైన నరాళకుంతలా" అనేవారు పూర్వం, అది మానేసి "అలిగితివా సఖీ ప్రియా అలుకమానవా" అని భాగేశ్వరిలో శుభ్రమైన లవ్‌సాంగ్ ఎత్తుకున్నారు. శ్రీరాగమన్నా ఎత్తుకోండి దోమలు పారిపోతాయి నే వచ్చేదాకా అన్నాను. నువ్వు రావే నువ్వొస్తే

సగం దోమలు నిన్ను కుడతాయి అప్పుడు అర్ధాంగి అన్న పేరుకి సరిగా సరిపోతావు అన్నారు. సరిగ్గా యిదే సమయానికి చాపచుట్టా చెంబు పుచ్చుకుని అరుగుమీద కూర్చున్న ధూళిధూసరితాంగియైన అర్ధాంగి నుద్దేశించి, మా పక్కవాటా కోపరేటివ్ బ్యాంకి గుమాస్తా (ఆయన చొక్కాకి గుండుసూదులు పెట్టుకుంటాట్ట అంచేత ఆవిడ అతగాడ్ని గుండుసూదులరావుగారంటుంది) "సఖీ-నీ-కి-దే-లా--వ-న-వా-సమూ" అని ఎత్తుకున్నాడు భీంపలాస్‌లో. ఆయనకు భీంపలాసిష్టం ఆవిడకు ఫలహారానికి పకోడిలిష్టం... ఆ మూడ్రోజులూ ఆ మొగుడ్ని దివాలా తీయించేస్తుంది ఆ మహా ఇల్లాలు. ఓ పకోడీల్దగ్గర్నుంచి మసాలాదోసె వరకూ చిరుతిళ్ళు లాగించేస్తూ మొగుడితో చెప్పకుండా నేలకో బెంచీకో మ్యాట్నీలకు చెక్కేస్తూ వుంటుంది. వచ్చిన ప్రతి పిక్చరూ ఒకటికి రెండు సార్లు చూడాల్సిందే - సినిమాకి డబ్బులు కోసం ఆవిడ న్యూస్ పేపర్లు అమ్మేస్తుంది. కిరసనాయిలు రెండు కాయలు పోయించుకుంటున్నానని చెప్పి కాయి పోయించుకుని అలా రెండు కిరసనాయిలు కాయలెట్టి ఓ సినిమా చూసోస్తుంది. అటువైపు అయిదారిళ్ళవారు కూడబలుక్కున్నట్లు ఒక్కసారే కూర్చుంటారు. కొంత కాలానికి అవుటాఫ్ డోర్స్ ఆడాళ్ళంతా కలిసి జాలీ యంగ్ విమన్స్ క్లబ్బోటి స్థాపించారు. మంచి చీరలు కట్టుకుని ఏమి ఎరగనట్లు చిలకల్లా ముస్తాబయి మ్యాట్నీ తరువాత మాట్నీ చొప్పున చూసొస్తారు. డెప్టీకలెక్టరుగారి క్యాంప్ క్లర్క్ గారి మూడోభార్య యీ జాలీ యంగ్ విమెన్స్ క్లబ్‌కి నాయకురాలు. తతిమ్మా మొగుడు చాటు మగువలకు ఆ మూడ్రోజులూ ధైర్య సాహసాలు నూరిపోస్తూ వుంటుంది. ముసలి క్యాంప్ క్లర్క్ గారి మూడోపెళ్లాం పేరు రాజా (అంటే రాజేశ్వరి) ఆవిడ్ని అంతా ప్రొడ్యూసర్లు ఫిలిం ఫైనాన్స్ కార్పొరేషన్‌ని చూసినట్లు చూస్తారు. సినిమాలకు డబ్బులు మదుపు పెడుతూ వుంటుంది. మదన రసిక వగైరా వగైరాలనుంచి జ్యోతులూ దిబ్బదిరుగుండం వరకూ చదివే మెటీరియల్ ఆవిడే సప్లయి చేస్తూవుంటుంది. కొంత మంది మగాళ్లు యీ జాలీ యంగ్ విమెన్స్ క్లబ్బుని చూసీ చూడనట్టు వూరుకున్నారు. కొంత మంది మగరాక్షసులు తమ అమాయకురాళ్ళైన ఇల్లాండ్ర యీ వెర్రి వెధవ్వేషాలేవిటి మూల కూర్చోక వూరంతా పెత్తనాలా అని యీ చెంపా ఆ చెంపా వాయగొట్టారు. మ్యాట్నీలకు వెళ్ళడం సతీ ధర్మం క్రిందే వస్తుందని రాజా ఆర్గ్యుమెంటు -

కరివేపాకు కమల వృత్తాంతము చెప్పెదనవధరింపుడు! కరివేపాకు చెట్టు దగ్గర కమల వాటావుంది గనుక అంతా ఆ అమ్మాయిని కరివేపాకు కమల అనీ, ఆ అమ్మాయి మొగుడ్ని కరివేపాకు కమల మొగుడనీ అంటారు. అంతేగాని కమలకూ కరివేపాకు చెట్టుకివున్న సంబంధం బాదరాయణమ్ - కమల చాలా స్వీట్ లిటిల్ థింగ్....రబ్బరు బంతిలాగుంటుంది కాని అసలు పిల్ల బేబీయే... కరివేపాకు కమలవున్న వాటాకి యంగ్‌విమెన్స్ జాలీక్లబ్ కార్యాలయం (అదే ముట్లగది అనిపూర్వం తెలివితక్కువగా వ్యవహరించేవారు) అర ఫర్లాంగ్ దూరంలో

వుంటుంది. పిల్ల భయస్థురాలుగదా అని వాళ్ళ అమ్మ కమలను రాజాకిచెప్పి మరీ అప్పగించింది. కమలకి రాజాకి దోస్తీ ఎక్కువవటం కమలాప్తునికి అట్టేగిట్టదు. ఓ రోజున కమలాప్తుడు కమల కోసం మిట్టమధ్యాహ్నం వచ్చేసరికి ఇంటికి తాళం వేసివుంది. యంగ్ విమెన్స్ జాలీక్లబ్ అంతా పొలోమని ఒక డబ్బింగ్ చిత్రానికి పోయారు. మ్యాట్నీ కెళ్ళి వచ్చిన కమల బాల మీద కమలాప్తుడు ఫైరయిపోయి "ఎవడిదగ్గర కెళ్ళావెరాస్కెల్" అన్నాడు. అంత మాటన్నాక కమల కొయ్యబారి పోయింది. అఫ్‌కోర్స్ సినిమాకెళ్ళడం తప్పేకావచ్చుగాక అంతమాత్రానికి తన క్యారెక్టర్ మీద దెబ్బతీస్తాడా శ్రీనాథుడని కమల చాల వగచింది. వగచిందేవిటిమూగబాలై పోయింది. గన్నేరుపప్పు నూరుకుని నూనెలో కలుపుకుని నీరుతాగినట్లు త్రాగేసి తలుపులేసుకుని పడుకుంది. యంగ్ విమెన్స్ జాలీక్లబ్బంతా అట్టుడికిపోయింది. కమలాప్తుడు కుమిలిపోయి దిబ్బ మొహం వేసుగుని డెప్టీ కలెక్టరుగారి క్యాంప్‌క్లర్కు మూడో భార్య రాజా ఉరఫ్ రాజేశ్వరి శరణుజొచ్చాడు. పోలీసు కేసవకుండా–కరివేపాక్క మలని హాస్పిటల్లో జాయిన్చేశారు. అక్కడ తిన్నదంతా కక్కించారు. కమల బాల చుట్టూ కమల బాల యంగ్ విమెన్స్ జాలీక్లబ్ సభ్యులంతా వున్నారు. వారంతా కమల మొగుడ్ని శపించారు. (సినిమాకు వెళ్ళినందుకు శీలమును శంకింతువా అని) అతను ... ప్రతి సినిమాకు కరివేపాకు కమలని బాల్కనీకి తీసికెళ్తానని చెవులు నులుముకుంటూ చెప్పాడు. కమల ఆస్పత్రి నుంచి రిలీజయి సైకిల్ రిక్షాలో యింటికొచ్చిన్నాడు "రాజా" (బ్యాంకుల్ని జాతీయం చేసిన ఇందిరాగాంధీకి రిక్షావాళ్ళూ టాంగావాళ్ళూ జై కొట్టినట్లు) బ్రహ్మాండమైన రిసెప్షనిచ్చింది. కరివేపాకు కమలలాగ సినిమా వెళ్ళొద్దంటే సూయిసైడ్ చేసుకుంటారేమో వయసుకత్తెలని తమ మగువలను సినిమా విషయంలో రొక్కించటం మానేశారు గుండుసూదిరావుళ్ళు.

సౌండు ఆఫ్ మ్యూజిక్ గురించి చెబ్తుంటే యంగ్ విమెన్స్ జాలీక్లబ్ మధ్యలో అడ్డొచ్చింది కాఫీలోపడ్డ కచ్చపంలా అటే తెలీదా తెలీదా. నాకూ తెలీదులెండి. అదుగో మావారు ఖూనీరాగాలు తీస్తున్నారు ఖర హర ప్రియలో "బాలనురా మదనా విరితూపులు వేయకురా మదనా" అంటూ ఈయనకి మతిపోయినట్టుంది "బాలనురా మదనా" అంటారేవిటి నాన్సెన్స్! ననుపాలింపా నడచివచ్చితివా నా ప్రాణనాథా అనినేననాలనికామోసు మోహనరాగం నేను చస్తే పాడను. నాకు పొయ్యి లేదా స్టవ్ అలికితివా సఖీ అలుకమానవా అంటేనే యిష్టం. కరివేపాక్కమలకి నెల తప్పిందట– దానికి తప్పకుండా పదహారు సినిమా కళలున్న బాలుడు పుట్టుకొస్తాడు. మరి తప్పదు. యంగ్ విమెన్స్ జాలీక్లబ్‌కి పెద్దపార్టీ ఇచ్చింది. దాని మొగుడు కుక్కిన పేనులాగ పట్నం సుబ్రహ్మణయ్యరుగారు చెప్పినట్టు భైరవిలో "నీపాదములే గతియని నమ్మితి నీరజాక్షి పరాశక్తి" అని పడివున్నాడుకాని నోరు మెదిపితే ఒట్టు. ఇంటింటా ఇటువంటి సత్యభామ లుంటే ప్రతి ఇల్లూ ఒక పంచరంగుల సినిమా కాక తప్పదు, తప్పదు తప్పదు.